# టెక్స్ట్ బుక్

కె.ఎ.నూయేమన్

ఆ రోజు సహీర్ బడిలో మొదటి రోజు.

తండ్రి చేతిని గట్టిగా పట్టుకుని ఈడ్చుకుంటూ గర్వంగా బడికి నడుస్తున్నాడు. కొత్త చొక్కా, భుజం మీద కొత్త సంచి, చేతిలో ఇంకా వాడని కొత్త గొడుగు. నిజానికి బస్‌స్టాప్ నించే సహీర్ ఎగురుతూ, తుళ్ళుతూ వెళ్తున్నాడు. ఆనందంతోపాటు అతనికి ఆత్రంగా కూడా ఉంది. వర్షం వచ్చేస్తే? కొత్త చొక్కా తడిసి మాసిపోతే? ఉప్పా చేతిలో తప్పకుండా తిట్లు తినాల్సిందే. అవునూ, ఉప్పా రోజూ ఇలా బడికి తోడు వస్తాడా? అయ్యో! అలా చెయ్యకపోతే బాగుండు. చక్కగా అక్కలతో, అన్నలతో నవ్వుతూ, ఆడుకుంటూ కలిసి నడవడం ఎంతో సరదాగా ఉంటుంది. కాని ఇప్పుడు ఆ విషయం తను అస్సలు ఎత్తదలుచుకోలేదు. ముందు బడి మానెయ్యమంటారు. అసలే ఎన్నో రోజులు ఎదురు చూసి చూసి, ఎంతో ఏడ్చి, పేచీ పెట్టిన తర్వాత కదా ఉప్పా బడిలో చేర్పించింది. తమ చుట్టాల్లోనూ, చుట్టుపక్కల వాళ్ళలోనూ, బడికి వెళ్ళే అక్కలని, అన్నలని రోజూ సహీర్ వరి చేలవరకు సాగనంపి వచ్చేవాడు. టిఫిన్ డబ్బా, బొమ్మల పుస్తకాలు, నల్లటి పలకపై టీచర్లు పెట్టే రంగు రంగుల టిక్కులు – బడి అనగానే సహీర్‌కి ఇవన్నీ గుర్తుకువస్తాయి. రోజూ సాయంత్రం ఇంటికి వచ్చేసరికి అన్న చొక్కా అంతా మాసిపోయి నల్లగా అయిపోయేది. అది చూసి సహీర్ బడి అనే విశాలమైన మైదానంలో తను కూడా దొంగ–పోలీస్ ఆట ఆడుతున్నట్లు ఊహించుకునేవాడు. కానీ, ఈ ఊహతో ఏడుపు ఆగేది కాదు. ఉమ్మా కొంగు పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చేవాడు. అతని ఉత్సాహం, ఆరాటం చూసి చాలా సార్లు ఉప్పా గోవిందన్ టీచర్‌ని బడిలో చేర్చుకోమని అడిగేవాడు. కాని ఎప్పుడూ వచ్చేది ఒకటే సమాధానం: “వాడికి కనీసం ఐదేళ్ళు నిండాలి”.

ఆఖరికి, ఈ రోజు, రంగు రంగుల సంచి భుజానికి తగిలించుకుని, తన కలలతో అచ్చువేసిన గొడుగు పట్టుకుని బడికి నడుస్తున్న సహీర్‌కి తను చాలా పెద్ద వాడైపోయినట్టు అనిపించింది. నల్ల పలకపై తను రాసిన వంకర– టింకర అక్షరాల పక్కన టీచర్లు టిక్కు గుర్తులు పెట్టారు. తను ఇప్పుడు ఆరవ తరగతికి వచ్చాడు. ఎప్పుడైనా ఒకసారి, టీచర్లు తనని కొట్టినప్పుడు సహీర్‌కి చాలా బాధగా ఉండేది. బడి గురించి తను కన్న కలల్లో ఎప్పుడూ ఈ దెబ్బలు లేవు. ఐతే ఈ మధ్య టీచర్ కొడితే తను టీచర్ దగ్గర నించి బెత్తం లాక్కుని కిటికీ బైటకి విసిరేస్తున్నట్లు కలలొస్తున్నాయి.

అయినప్పటికీ సహీర్‌కి బడంటే చాలా ఇష్టం. గోవిందన్ టీచర్, గంగాధరన్ టీచర్, షైలా టీచర్, సులెమాన్ టీచర్ అందరూ ఇష్టమే. అయినా ఎందుకో సహీర్‌కి అప్పుడప్పుడూ బళ్ళో చాలా బెంగగా ఉండేది. ఉప్పా, ఉమ్మా, వలియుమ్మ అందరూ తనునుంచి ఎక్కడో చాలా దూరంగా ఉన్నట్టు అనిపించేది. తనకి ఇష్టమైన వాళ్ళూ, తనని ప్రేమించే వాళ్ళూ, తనకి తెలిసిన ప్రపంచం – ఇవన్ని బడికన్నా వేరేగా, చాలా దూరంగా ఉన్నట్టు అనిపించేది. సహీర్ వాళ్ళది కేరళలోని కోళిక్కోడు దగ్గర పూతన్‌కన్ను అనే చిన్న ఊరు. అక్కడ అతనికి చాలా

మంది స్నేహితులు ఉన్నారు – రషీద్, అబ్దుల్లా, షఫీక్, షమ్‌షుద్దీన్, రహీమ్ – ఇంకా ఎందరో, రోజూ పగలు, సాయంత్రం గాల్లో తేలి వచ్చే ఖురాన్ పద్యాలూ, రోజుకి ఐదుసార్లు మసీదు నుంచి వినిపించే అబ్దుల్లా ఉస్తాద్ అజాన్, ఎల్లప్పుడు తస్బీ మాలను భక్తిగా జపిస్తూ ఉండే ఉప్పా, ప్రతి గురువారం సాయంత్రం మగ్రీబ్ ప్రార్థన తర్వాత దిక్ర్ జపం, దిక్ర్ అనంతరం చాయి తాగడం, అందరితో పత్తిరి రొట్టె పంచుకు తినడం, మసీద్ ఆవరణలో తోటి స్నేహితులతో కొబ్బరి ఆకుల బంతితో ఆడడం – గుర్తు తెలిసినప్పటి నించి ఇవీ సహీర్ ప్రపంచం.

ప్రతిరోజూ ఉదయం సహీర్ మద్రసాకి వెళ్ళేవాడు. ఏడు గంటల నించి తొమ్మిది వరకు అక్కడ పాఠాలు. మమ్ము ఉస్తాద్ పిల్లలకి అరబీ అక్షరాలు, ఖురాన్ పారాయణ చేయటం, నమాజ్ చేయటం, ప్రార్థన చేయటం, ఇవన్నీ నేర్పేవాడు. మద్రసా అయిన వెంటనే సహీర్ ఇంటికి పరుగు పెట్టేవాడు. ఇంటి నుంచి మళ్ళీ మూడు కిలోమీటర్ల దూరంలో బడికి వెళ్ళాలి. పొద్దున్నే తాగిన కాఫీ, తిన్న బిస్కట్లతోనే ఎక్కువగా సరిపెట్టుకునే వాడు సహీర్. మళ్ళీ మధ్యాహ్నం వరకు ఇంక ఏమీ తినేవాడుకాదు. ఎప్పుడైనా ఒకసారి మద్రసా నుంచి వచ్చాక చాయి తాగేవాడు. రోజూ తొమ్మిదిన్నరకల్లా ఉమ్మా టిఫిన్ డబ్బాలో అన్నం, సంచిలో పుస్తకాలు సర్ది ఉంచేది. అవి తీసుకుని మళ్ళీ బడికి పరుగు.

తరగతులు ఖచ్చితంగా తొమ్మిదింటికి మొదలయ్యేవి. అసెంబ్లీ ఉన్న రోజైతే ఎనిమిది యాభైకే. ఎప్పుడైనా పది నిమిషాలు ఆలస్యమైనా, మొదటి గంట పాఠం అయ్యేవరకు బయట నుంచుని, టీచర్‌తోపాటు స్టాఫ్ రూమ్‌కి వెళ్ళి హాజరు వేయించుకుని రావాల్సి వచ్చేది. అక్కడ మిగతా టీచర్ల అందరి ముందూ, అతనికి బాగా తిట్లు పడేవి.

దాంతో సహీర్ జీవితం మొత్తం, మద్రసానించి ఇంటికి, ఇంటి నుండి బడికి, అదుర్దాగా పరుగులు పెట్టడమే సరిపోయేది. క్లాస్‌కి ఆలస్యమవుతుందని భయం, టీచర్లు తిడతారని భయం.

“ఈ లెక్కన, నేను ఏదో ఒకరోజు పి.టి.ఉషని కూడా మించి పోతానని” సహీర్ అప్పుడప్పుడు అనుకునేవాడు. ఆరవ తరగతికి వచ్చేసరికి సహీర్ పరుగు పందేలలో మంచి దిట్టగా పేరు తెచ్చుకున్నాడు.

బడీ, మద్రసాయేకాక, సహీర్‌కి బాగా ఇష్టమైన ప్రపంచం ఇంకొకటుంది. అది వలియుమ్మ కథల, పాటల ప్రపంచం. ఆమె నఫీసత్‌మాల పాడితే ఎవరైనా చెవులు అప్పగించి వినాల్సిందే. ఆమె పాటకి ఒక ప్రత్యేకమైన రాగం తాళం ఉండేవి. ఆమె పాడే పాటలూ, వీర గాథలూ ఎక్కడా బడి పుస్తకాలలో గాని, బాలరమా, పూమ్‌పాట్టా లాంటి పిల్లల పుస్తకాలలో గాని కనిపించేవి కాదు. ఆమె దగ్గర అవి వినీ, వినీ సహీర్ చరిత్ర చాలానే నేర్చుకున్నాడు – మొహమ్మద్ షేక్ కథ, బదర్ యుద్ధం కథ, అలియార్ అంగ్ కథ, బదురుల్ మున్నీర్

– హుస్నుల్ జమాల్ల ప్రేమకథ – ఇలా వలియుమ్మ ఈ కథలన్నీ గానం చేస్తుంటే, ఆ వీరులందరిని స్వయంగా, ముఖాముఖి కలిసినట్టుండేది. ఇంత పొడుగాటి, పెద్ద పెద్ద కథలు అసలు ఆమెకి ఎలా గుర్తుంటాయని సహీర్‌కి చాలా ఆశ్చర్యంగా ఉండేది.

కాని బడిలోని తన స్నేహితులెవరికీ ఈ కథలు, పాటలు తెలియవని సహీర్‌కి చాలా బాధగా ఉండేది. "ఈ కథలు – పాటలు బడి పుస్తకాలలో ఉండవేం...?" అవి ఒకసారి వలియుమ్మని అడిగాడు. ఆమె ఏమీ బదులు చెప్పలేదు. బహుశా ఆమెకి కూడా ఈ ప్రశ్నకి జవాబు తెలీదు కాబోలు. మళ్ళీ ఇంక ఎప్పుడూ సహీర్ వలియుమ్మని ఆ ప్రశ్న అడగలేదు.

వలియుమ్మని ఒకరోజు బడికి తీసుకుపోయి షైలా టీచరు కుర్చీలో కూర్చోపెట్టి, తరగతిలో అందరికి ఆమెతో పాటలు పాడించి, కథలు చెప్పించాలని సహీర్‌కి చాలా కోరికగా ఉండేది. కాని అది జరిగే పనేనా? బడి పుస్తకాలలో లేని కథలన్ని వలియుమ్మ చెప్తే, షైలా టీచర్ ఊరుకుంటుందా? ఏమో!

ఆరవ తరగతి 'బి' డివిజన్ వాళ్ళకి ప్రతి రోజు నాల్గో పీరియడ్ మళయాళం. ఓనమ్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని టీచర్లందరూ పాత పాఠాలన్నీ తిరిగి చదివించటం మొదలు పెట్టారు. ఎప్పటిలాగే గంగాధరన్ టీచర్ పేము బెత్తాన్ని తన టెక్స్ట్ బుక్కులో చదివే పేజీకి గుర్తుగా పెట్టుకుని వచ్చాడు. కొన్ని పాత పరీక్షా పత్రాలు తిరగేసి పరీక్షా విధానం ఎలా ఉంటుందో అందరికి వివరించాడు. "మీలో చాలా మంది 'సందర్భానుసారం వివరించండి' అనే ప్రశ్నకి ఎప్పుడూ తప్పు సమాధానాలు రాస్తారు...మీకు అసలు పాఠాలలో ఉన్న వ్యక్తుల పేర్లే సరిగ్గా గుర్తుండవు", అంటూ పిల్లలందరిని ప్రతి పాఠంలో వచ్చే పేర్లన్నీ వరసగా నోటు పుస్తకంలో రాయమన్నాడు.

అందరితోపాటు సహీర్ కూడా త్వరత్వరగా ఒక్కొక్క పాఠం తిరగేసి అందులోని వ్యక్తుల పేర్లు రాశాడు. నాలుగు పాఠలూ కలిపి మొత్తం పదకొండు పేర్లు ఉన్నాయి. అందరూ రాయటం అయిపోయింది. టీచర్ సహీర్ వైపు తిరిగి జవాబులు పైకి చదవమన్నాడు. సహీర్ చదవసాగాడు.
మొదటి పాఠం – 'మంచి మిత్రుడు' లో కుట్టన్, ఉన్ని, కుంజులక్ష్మీ, ఇంకా అమ్ము.
రెండో పాఠం – 'జిత్తులమారి రాము'లో రాము, మాధవి మరియు ఆరోమల్
మూడో పాఠం – 'కష్టఫలం'లో రామన్, కుంజున్ని, సత్యన్

సహీర్ ఒక్క క్షణం ఆగి దు:ఖంతో కూడిన గొంతుతో గట్టిగా అన్నాడు, "రషీద్"

తరగతిలో ఒక్కసారిగి నిశ్శబ్దం! పుస్తకం మధ్య సగం దాగి ఉన్న బెత్తాన్ని గంగాధర్ టీచర్ బయటికి తీశాడు.

ఆయన కళ్ళు బంగారు ఫ్రేమ్ అద్దాలపై నుంచి సహీర్‌ని విచిత్రంగా చూశాయి. “ఏంటీ? రషీదా? నీకు ఆ పేరు ఎక్కడ కనిపించింది?” అని సహీర్‌ని ప్రశ్నించాడు. “పుస్తకంలో మొత్తంలో ఆ పేరు ఎక్కడా లేదే?”
సహీర్ తడబడ్డాడు. “సార్..అదే ఎందుకంటే.. పుస్తకంలో ఎక్కడా ఒక్క ముస్లిమ్ పేరు కూడా లేదు”

తరగతి మొత్తంఘొల్లున నవ్వారు. దానితో కొంచెం ధైర్యం పుంజుకుని, సహీర్ గంగాధరన్ టీచర్ వంక చూశాడు. గంగాధరన్ టీచర్ బెత్తంతో గట్టిగా బల్లమీద కొట్టాడు. పిల్లలంతా నోళ్ళు మూసేశారు. కష్టం మీద కోపాన్ని అణచుకుంటూ టీచర్ సహీర్‌ని అడిగాడు – “ఏంట్రా, హిందూ ముస్లిమ్ అంటున్నావ్? మతతత్వం గురించి మాట్లాడుతున్నావా?”.

సహీర్ బిత్తరపోయాడు. అతనికి ఆ ప్రశ్నే అర్థం కాలేదు. గంగాధరన్ టీచర్‌ని అడుగుదామనుకున్నాడు. కానీ అంతలోనే గంట మోగింది.